క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి

పిఠాపురం: ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పిఠాపురం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పిఠాపురం మండలం భోగాపురానికి చెందిన అల్లుమల్లు వీర రాఘవ శ్రీనివాస్ (22) ఆదివారం అర్ధరాత్రి గొల్లప్రోలులోని తన స్నేహితుల వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభమైన గౌరీదేవి ఉత్సవాలు

కొత్తపల్లి: స్థానిక బీటు వీధిలో గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గౌరీదేవిని ప్రతిష్ఠించిన భక్తులు అమ్మవారికి నెల రోజుల పాటు కన్యతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తిక పౌర్ణమికి మూడు రోజుల ముందు గౌరీ శంకరుడిగా భావించే నందీశ్వరుని ఊరేగింపుగా తీసుకువస్తారు. అనంతరం మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారమని గౌరీశంకర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గురుస్వామికి ఘన సన్మానం



గురుస్వామిని సన్మానించిన అయ్యప్పస్వామి భక్తులు

సామర్లకోట: గత 35 ఏళ్లుగా నిరంతరాయంగా అయ్యప్ప స్వామి మాల ధరించి ఎందరో భక్తులకు మాలధారణ చేస్తున్న గురుస్వామి ఆచంట సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని పల్లపువీధి రామాలయం వద్ద నిర్వహించిన లక్ష బిల్వార్చన అనంతరం గురుస్వామి సత్యనారాయణను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, నువ్వుల బాబ్జి, దేగల శ్రీనివాస్, రామస్వామి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సామర్లకోట: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బొందల రత్నమణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ వారోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. 15వ తేదీ పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న చిత్రలేఖన పోటీలు, 18న వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతాయన్నారు.

భక్తితత్వాన్ని పెంపొందించుకోవాలి

కొత్తపల్లి: భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి తత్వాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. యండపల్లిలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, గురుస్వామి జ్యోతుల చక్రబ్బాయి ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల అన్న సమారాధనలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. మాల ధరించిన స్థానిక అయ్యప్ప స్వాములకు చక్రబ్బాయి ఆధ్వర్యాన ఈ ఆలయంలో ప్రతి రోజూ అన్నసమారాధన నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానం నైట్ వాచ్‌మన్ సస్పెన్షన్

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం నైట్ వాచ్‌మన్ పి.నూకరాజును ఈఓ రాపర్తి రాజేశ్వరరావు సోమవారం సస్పెండ్ చేశారు. మద్యం తాగి, ఆలయానికి వస్తున్న భక్తుల పట్ల అమర్యాదగా మాట్లాడుతూండటంతో గత ఏడాది అతడికి నోటీసులు ఇచ్చారు. ఇకపై ఆ తప్పు చేయబోనని అప్పట్లో నూకరాజు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చాడు. అయినప్పటికీ ఆదివారం మద్యం తాగి ఆలయానికి విధులకు రావడమే కాకుండా, అర్చకులు, వారి కుటుంబ సభ్యులను కొట్టేందుకు ప్రయత్నించాడు. దీనిపై అర్చకుల ఫిర్యాదు మేరకు నూకరాజును సస్పెండ్ చేస్తూ ఈఓ ఆదేశాలు జారీ చేశారు. నూకరాజుపై అర్చకుడు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

ఆనంద నిలయానికి రూ.15 లక్షల సాయం

కాకినాడ రూరల్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆనంద నిలయం వసతి గృహంలో అదనపు గదుల నిర్మాణానికి కోరమండల్ ఎరువుల కర్మాగారం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.15 లక్షలు అందించింది. ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లాకు ఆ సంస్థ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం కలెక్టరేట్‌లో చెక్కు అందజేశారు. ఈ నిధులతో ఆనంద నిలయంలో మరో రెండు గదులు నిర్మించి, పిల్లలకు వసతి కల్పించవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ పద్మనాభం పాల్గొన్నారు.

ఓం నమః శివాయ

- నేటి నుంచి కార్తిక మాస పూజలు ప్రారంభం
- పంచారామ క్షేత్రంలో నెల రోజుల పాటు ఉత్సవాలు



సామర్లకోటలోని పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

సామర్లకోట: మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండడంతో శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు గోపూజతో కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభిస్తారు. స్వామి వారికి తొలి అభిషేకం, పూజలను పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో నిర్వహిస్తారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తారు. ఆలయంలో ప్రతీ రోజు లక్ష పత్రి పూజలు నిర్వహించుకోవడానికి దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

టిక్కెట్ల ధరల్లో మార్పు

లక్షపత్రి పూజలు చేసుకునే వారు దేవస్థానానికి రూ.2,500 చెల్లించవలసి ఉంటుంది. స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకోవడానికి ఉచిత దర్శనంతో పాటు రూ.10 ఉండే టిక్కెట్‌ను రూ.20, రూ.30 టిక్కెట్‌ను రూ.50గా మార్చారు. ప్రత్యేక



పాదగయ పుష్కరిణిలో భక్తుల పుణ్య స్నానాలు (ఫైల్)

దర్శనానికి టిక్కెట్ రూ.100గా నిర్ణయించారు. ఈ మేరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు తెల్లవారుజామున పాలతో ఒకసారి మాత్రమే అభిషేకం చేస్తారు. కార్తిక మాసంలోని సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున మాత్రమే పంచామృతాలతో అభిషేకాలు చేయడానికి అనుమతులున్నాయి. కార్తిక మాసంలో నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం గోపూజ, లక్షపత్రి పూజలు, సాయంత్రం విఘ్నేశ్వరుని పూజలు చేస్తారు. లక్ష పత్రి పూజలు చేసుకునే వారి కోసం ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. మంగళవారం సాయంత్రం ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించి ఆలయంలో కార్తిక దీపాలను ప్రారంభిస్తారు.

29న ఆలయ కోనేరులో తెప్పోత్సవం

మంగళవారం నుంచి డిసెంబరు 13 వరకూ కార్తిక మాసం ఉత్సవాలు నిర్వహిస్తారు. నవంబరు 27న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి గ్రామోత్సవం, సాయంత్రం గోదావరి హారతి, రాత్రి జ్వాలాతోరణం ఉంటుంది. నవంబరు 29న స్వామి వారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుగుతుంది. 30న ఆరుద్ర నక్షత్ర అభిషేకాలు జరుగుతాయి. డిసెంబరు 11న మాసశివరాత్రి పూజలు, 12న అమావాస్యను పురస్కరించుకుని కోటి దీపాలంకరణ, 13న పోలి పాడ్యమి సందర్భంగా స్వామి వారి జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్తిక మాసం ఈ నెల 20, 27, డిసెంబరు 4, 11 తేదీల్లోని సోమవారాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి. పంచారామాల దర్శనం కోసం వచ్చే బస్సులు వచ్చే వరకూ ఆలయం తెరిచి ఉంచుతారు. కార్తిక మాసం సందర్భంగా భక్తులు ఆలయ కోనేరులో, గోదావరి కాలువలోనూ స్నానాలు చేస్తారు. ఈ మేరకు ఆలయ కోనేరులో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి గోదావరి కాలువ నీటితో కోనేరును నింపారు. కోనేరులో స్నానాలు చేసిన మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం



భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాం. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణతో పాటు ప్రతీ రోజు ఉదయం 11.30 గంటల నుంచి అన్నప్రసాదం అందిస్తాం. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటుచేశాం. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు పెట్టించాం.

– డి.నాగమల్లేశ్వరరావు, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

ముస్తాబైన పాదగయ

పిఠాపురం: దేశంలోని మూడు గయ క్షేత్రాల్లో ఒకటైన పాదగయ పవిత్ర కార్తిక మాస వేడుకలకు ముస్తాబైంది. కార్తిక మాసం ప్రారంభ కానుండటంతో మంగళవారం నుంచి భక్తులు పాడ్యమి దీపాలు వెలిగించి పూజలు ప్రారంభించనున్నారు. పిఠాపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సోమవారం పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా స్వామి వారికి ప్రతి రోజూ లక్షపత్రి పూజ, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లూ చేశారు. కార్తిక మాసం ప్రారంభం కానుండటంతో పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



పంచారామ క్షేత్రంలో అన్నప్రసాదం వద్ద బారులు తీరిన భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దీపావళి తరువాత రోజు సోమవారం రావడంతో కార్తిక మాసం ప్రారంభం అయినట్లుగా భావించి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి పూజ, తొలి అభిషేకాలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలిపూజను ఆలయ పండితులు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరఫున అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

నేడు వాక్ ఫర్ జీసస్

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం మంగళవారం వాక్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం ఫాస్టర్ రెవరెండ్ నంగిన సత్యానందం, క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్‌లు తెలిపారు. తిరుపతి నుంచి దివిలి, పులిమేరు, గుడివాడ మీదుగా కిర్లంపూడి మండలం భూపాలపట్నం వరకూ క్రీస్తు సువార్త ప్రకటిస్తూ భారీ ప్రదర్శన చేస్తామన్నారు.

రబీకి నీరు ఇవ్వండి



ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలసిన రైతులు

పిఠాపురం: రబీ సాగు చేసేందుకు వీలుగా తమ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని గొల్లప్రోలు మండల రైతులు ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, ఆత్మ చైర్మన్ కడింశెట్టి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జీ ఆధ్వర్యాన పలువురు రైతులు ఎమ్మెల్యేను సోమవారం పిఠాపురంలో కలిశారు. ఏలేరు ఆయకట్టులోని గొల్లప్రోలు మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా మండల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరాలు సాగు చేసుకోవాల్సిందిగా తమకు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. ఇప్పటికే వరి కోతలు 40 శాతం పూర్తవ్వగా రబీ సాగు కోసం భూములను ఆరబెట్టి ఉంచామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రబీ లేదని చెప్పడం వల్ల నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దొరబాబు ఏలేరు జలాశయంలో నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరిందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. ఈ సమస్యపై కాకినాడలో మంగళవారం జరిగే నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఉన్నతాధికారులతో చర్చిస్తామని, ప్రతి ఎకరానికీ నీరందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

గొయ్యిని పూడ్చారు



గొయ్యిని పూడ్చుతున్న దృశ్యం

కొత్తపల్లి: పిఠాపురం – ఉప్పాడ రోడ్డులో ఎత్తు తూము సమీపాన తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేయడంపై 'ప్రమాదం జరిగేదాకా ఇంతేనేమో' శీర్షికన 'సాక్షి' ఈ నెల 4న కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేసి, ఆ గోతిని పూడ్చారు.

సాక్షి ఇంపాక్ట్

యువకుడి ఆత్మహత్యా యత్నం

- రక్షించిన పోలీసులు
- బంధువులకు అప్పగింత

కొత్తపల్లి: ప్రేమ విఫలం కావడం, తల్లిదండ్రులు మృతి చెందడంతో మనస్తాపానికి గురైన ఒక యువకుడు ఆదివారం సముద్రంలో పడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సూరాడ వరుణ్ సూర్య ఇటీవల ఒక యువతిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించింది. ఇదిలా ఉండగా అనారోగ్యం కారణంగా వరుణ్ సూర్య తల్లిదండ్రులు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డులోని ఎస్‌పీజీఎల్ సమీపాన సముద్రంలో పడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన పర్యాటకులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. అదే సమయానికి బీచ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై స్వామినాయుడు.. స్థానిక మత్స్యకారుల సహాయంతో వరుణ్ సూర్యను రక్షించి, ఒడ్డుకు చేర్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.



వరుణ్‌సూర్యను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

15న చలో విజయవాడ



ప్రచార యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూరిబాబు

పెద్దాపురం: ఈ నెల 15వ తేదీన నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సీపీఎం ప్రజా రక్షణ భేరీ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని చెప్పి రెండు రెట్లు ధరలు పెంచిందన్నారు. సీపీఎం ఉద్యమాల్లో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, కేదారి నాగు, ఆర్.వీర్రాజు, చల్లా విశ్వనాథం, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

పెద్దాపురం: జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీర్రాఘవరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం: ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం సీఐ రవికుమార్ అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం రాత్రి పెద్దాపురం ఎస్ఐ వి.సురేష్ అధ్యక్షతన 'వారధి' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ చీటీల పేరుతో, యాప్‌ల పేరుతో ప్రజలు మోసపోతున్నారన్నారు. అటువంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. మహిళలు ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎన్నో మోసాలు ఎదుర్కొంటున్నారని, లోన్ యాప్‌లు వంటి వాటి జోలికి పోవద్దన్నారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ఇటీవల దివిలి, తిరుపతి, వడ్లమూరు పరిసర ప్రాంతాల్లో చీటీల పేరుతో ఎగనామం పెట్టడంతో చాలా మంది మోసపోయారన్నారు. కార్యక్రమంలో తుమ్మల దొరబాబు, బోనాసు గుర్రాజు, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, ఎద్దు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వారధి సదస్సులో ప్రసంగిస్తున్న పెద్దాపురం సీఐ రవికుమార్

ఆనందోత్సాహాలతో దీపావళి

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని ప్రజలు ఆదివారం రాత్రి దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇంటింటా దీపాలతో అలంకరించి మహిళలు పూజలు నిర్వహించారు. బాణసంచా కాల్చి వేడుకను వైభవంగా నిర్వహించుకున్నారు. ఏలేరు నదికి అవతల, ఇవతల గ్రామాలైన పెద్దాపురం మండలం చదలాడ, తిరుపతి గ్రామాల మధ్య బాణసంచా పోటీ తారాస్థాయికి చేరింది. ఏటా ఆనవాయితీగా వచ్చే ఈ పోటీలను గ్రామ స్థాయిలో పోటీపోటీగా నిర్వహించారు. దీపావళి పర్వదినం సందర్భంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. మరిడమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దీపోత్సవం నిర్వహించారు.



మరిడమ్మ అమ్మవారి ఆలయంలో దీపోత్సవం

సామర్లకోట: మండలంలోని గ్రామగ్రామాన ప్రజలు దీపావళి వేడుకలు ఆదివారం రాత్రి ఉత్సాహంగా జరుపుకున్నారు. తల స్నానం చేసి కొత్త బట్టలు ధరించి లక్ష్మీదేవికి పూజలు చేశారు. కొంత మంది గోగుకర్రలు, చెరుకు గడలకు నూనెతో తడిపిన వస్త్రాలతో వత్తులను తయారుచేసి వెలిగించి దివిటీలు కొట్టారు.

కొత్తపల్లి: మండలంలో ఆదివారం దీపావళి వేడుకను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా దివిటీలు కొట్టి, పండగను ప్రారంభించారు. ఇళ్లను దీపాలతో అలంకరించారు. ఆనందోత్సాహాలతో బాణసంచా కాల్చారు. మండలంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత రాజశేఖరస్వామి, శ్రీ ధర్మశాస్తా, ఉప్పాడ చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి, గోర్సలోని పురాతన రామాలయం, ఉమా రామలింగేశ్వరస్వామి, రమణక్కపేటలో విజయ జనార్దన స్వామి, మూలపేటలో బలభద్ర సుభద్ర సమేత జనార్దన స్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలను దీపాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

అటెన్షన్ ప్లీజ్

పూడుకుపోయిన కాలువ

ఉప్పాడ – పిఠాపురం రోడ్డులో వాకతిప్ప శివారున ప్రధాన కాలువ ఆక్రమణలకు గురవుతోంది. పంటలు ముంపునకు గురైనప్పుడు ఆ మురుగు నీరు చెరువులో కలిసేందుకు ఈ ప్రధాన కాలువను గతంలో నిర్మించారు. దీనిని పలువురు ఎక్కడికక్కడ ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టడంతో ఇది పూర్తిగా పూడుకుపోయింది. రోడ్డు నిర్మించి సైతం నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కాలువపై అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– కొత్తపల్లి



పిఠాపురం – ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప శివారులో పూడుకుపోయిన కాలువ

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక వైభవం

- నేటి నుంచి మహాశక్తి యాగం, బగళాముఖి అమ్మవారి హోమం
- శతకోటి కుంకుమార్చన
- రోజూ 12 వేల మంది మహిళలతో నెల రోజుల పాటు పూజలు
- మహా నక్షత్ర శాంతి, తిథి పూజలు, అతిరుద్ర యాగం
- రోజూ 5 వేల మంది మహిళలతో దీపోత్సవం



శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిపూర్ణనంద స్వామి

కాకినాడ రూరల్: కార్తిక మాసం ప్రారంభమయ్యే మంగళవారం నుంచే కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఆధ్యాత్మిక వైభవానికి తెర లేవనుంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా పరిపూర్ణానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఆయన ఆధ్వర్యాన మహాశక్తి యాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదిపరాశక్తి దివ్యరూపంగా కొలిచే బగళాముఖి అమ్మవారికి కోటిజప, తర్పణ, హోమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అమ్మవారికి ప్రత్యేకంగా గుడి కట్టారు. యాగశాలను ప్రత్యేకంగా రూపొందించారు. మహా నక్షత్ర, తిథి హోమాలతో పాటు అతిరుద్ర యాగం, శతకోటి (100 కోట్ల) కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ మహాశక్తి యాగం కోసం శ్రీపీఠం వెనుకన గోశాల ప్రాంగణంలో విశాలమైన ఖాళీ స్థలాన్ని ఎత్తు చేసి, పలు నిర్మాణాలతో సిద్ధం చేశారు. మహాశక్తి యాగం నిర్వహించే షెడ్‌ను 12 వేల మహిళలు కూర్చునేందుకు వీలుగా అందంగా తీర్చిదిద్దారు. యాగంలో పాల్గొనే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. మహాశక్తి యాగం కోసం 1,200 మంది వలంటీర్లు కొన్ని రోజులుగా సేవలందిస్తున్నారు. వీరిలో ఐటీ కంపెనీల్లో పని చేస్తున్నవారు సైతం ఉండటం విశేషం. వీరందరూ మహాశక్తి యాగంలో పాల్గొనే మహిళల రిజిస్ట్రేషన్, ఐడీ కార్డుల జారీ, విస్తృత ప్రచారం, యాగశాల ప్రాంగణంలో ఏర్పాట్లు తదితర పనులు నిర్వహిస్తున్నారు.



బగళాముఖి హోమం, నక్షత్ర హోమం జరిగే యాగ శాల పనుల్లో నిమగ్నమైన మహిళలు

ప్రతి రోజూ మహా క్రతువు జరుగుతుందిలా..

- ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు మహానక్షత్ర శాంతి పూజ జరుగుతుంది. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మహానక్షత్ర జపం, ఆ రోజు నక్షత్రానికి 9 గంటల వరకూ పూజ నిర్వహిస్తారు. మహాశక్తి యాగం జరుగుతుంది.
- ఉదయం 8 గంటలకు యాగశాలలో బగళాముఖి జపం, బగళాముఖి అనుష్ఠానం, రుద్ర పారాయణ, రుద్ర జపం, అతిరుద్ర, నక్షత్ర శాంతి జరుగుతాయి.
- ఉదయం 9.30 గంటలకు మహాశక్తి యాగం ప్రాంగణంలో 12 వేల మంది మహిళలు ఆశీనులవుతారు. ప్రతి రోజూ ఒక్కొక్క స్వామీజీ, పండితులు అనుగ్రహ భాషణం చేస్తారు. అనంతరం 10 నుంచి 10.30 గంటల మధ్య కుంకుమార్చన ప్రారంభమవుతుంది. కుంభకోణంలో 120 కేజీల పంచలోహాలతో తయారు చేయించిన పార్వతీ పరమేశ్వరుల మూర్తులకు ఈ కుంకుమార్చన నిర్వహిస్తారు. మూడుసార్లు పారాయణ ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు కుంకుమార్చన పూర్తి చేస్తారు.
- అనంతరం మధ్యాహ్న భోజనం.
- ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక ప్రాంగణంలో కోటి దీపోత్సవం జరుగుతుంది. దీని కోసం ఆవుపేడ, గోదావరి ఒండ్రు మట్టితో తయారు చేసిన ప్రమిదలు ఏర్పాటు చేస్తున్నారు. దీపోత్సవంలో 5 వేల మంది కూర్చుని పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.
- రాత్రి 7 గంటలకు బగళాముఖి హోమం ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి 4.75 లక్షల మంత్రోచ్చారణ చేస్తారు. 8 గంటల వరకూ జరిగే ఈ హోమంలో 41 రకాల మూలికలు వినియోగిస్తారు.
- రాత్రి 8.30 గంటలకు గంగానది ఏడు పాయల నుంచి సేకరించిన తీర్థాలను ఆ రోజు ఇతర తీర్థాలను కలిపి ప్రసాదంగా అందజేస్తారు.